
సాక్షి ఒడిశా

మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,86,742లు, బంగారం 320 మిల్లీగ్రాములు , వెండి 17 గ్రాముల 850 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వేటకు విరామం

సముద్రంలో చేపల వేట నిషేధం అమల్లోకి వచ్చింది. రెండు నెలల పాటు మోటారు బోట్లకు అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులిచ్చారు.

- 8లో



ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా..

మల్కన్‌గిరిలో డీజీ అరుణ్ కుమార్ షొడంగి పర్యటించారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

- 8లో

న్యూస్‌రీల్

ఆవోపా అధ్యక్షునిగా బుచ్చిబాబు



మాట్లాడుతున్న పత్తి బుచ్చిబాబు

బరంపురం : స్థానిక ప్రేమనగర్ 2వ లైన్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆవోపా సంఘ 2024 ఎన్నికల్లో అధ్యక్షునిగా పత్తి బుచ్చిబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

బంధువును హత్య చేసిన వ్యక్తి అరెస్టు



నిందితుడు సునీల్ నాయిక్

జయపురం : పంట పొలానికి సాగునీటి సరఫరా విషయంలో వరసకు సోదరుడైన వ్యక్తిని హత్య చేసిన ఉదంతంలో నిందితుడిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి సోమవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తి జయపురం సమితి అంత గ్రామ పంచాయతీ ప్రధానిగుడకు చెందిన బిరంచి నారాయణ సాహు(38) కాగా, నిందితుడు అదే గ్రామానికి సునీల్‌నాయిక్ ఉరఫ్ టిటు(50)గా వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. బెయిలు లభించకపోవడంతో జైలుకు తరలించినట్లు తెలిపారు.

గొంతు నులిమి హత్య..

బిరంచి నారాయణ, సునీల్‌నాయిక్‌లు బంధువులు. నారాయణ పొలం మీదుగా గగణాపూర్ పేపరుమిల్లు నీటి పైపులైన్ వెళ్తోంది. సునీల్ ఆ పైపులైన్‌కు రంధ్రం చేసి తన పొలాలకు నీటిని మళ్లించుకుంటున్నాడు. దీంతో నీరు అందక నారాయణ పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఇలా చేయవద్దని నారాయణ పలుమార్లు సునీల్‌ను హెచ్చరించారు. నీరు వృథాగా పోతుండటాన్ని గుర్తించి మిల్లు యాజమాన్యం రంధ్ర పూడ్చివేసింది. దీంతో సునీల్ ఆగ్రహానికి గురయ్యాడు. దీనికి నారాయణే కారణమని, ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 13న నారాయణ తన పొలం వద్ద ఉండగా సునీల్‌నాయిక్, అతడి పెద్దన్నయ్య బబులి నాయిక్‌లు వెళ్లారు. పైప్‌లైన్ విషయమై వాగ్వాదానికి దిగారు. ఈ తరుణంలో నారాయణను తీవ్రంగా కొట్టి గొంతు నులిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని రహదారిపై పడేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నారాయణను జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకితకుమార్ వర్మ, సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి కేసు దర్యాప్తు చేశారు. సునీల్‌ను అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.

కాంగ్రెస్‌ను వీడి బీజేడీలోకి..



వేదికపై గీతాంజలి పిడిక, రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్రో , జిన్ను హిక్కా, ప్రభుజానీ

కొరాపుట్: వివాదాస్పద రాజకీయ పరిణామాలకు కేంద్రమైన లక్ష్మీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ మార్పులు కొనసాగుతున్నాయి. బుధవారం భువనేశ్వర్‌లో బీజేడీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బందుగాం సమితి ఉపాధ్యక్షురాలు గీతాంజలి పీడిక తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌ను వీడి బీజేడీలో చేరారు. వీరికి పార్టీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్రో స్వాగతం పలికారు. కొరాపుట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు జిన్ను హిక్కా, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీలు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. వీరితో పాటు బందుగాం సమితి సభ్యులు, సర్పంచ్, సీనియర్ నాయకులు కూడా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గీతాంజలి మొదటి నుంచీ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. అయినా తనకు దక్కలేదు. కాగా, కాంగ్రెస్‌ను వీడి బీజేడీలో చేరిన మాజీ ఎమ్మెల్యే కై లాష్ కులసిక కూడా టికెట్ దక్కకపోవడంతో బీజేపీలో చేరారు. బీజేపి ఇంకా ఈ స్థానంలో అభ్యర్థిని ప్రకటించలేదు.

బాబోయ్ ఎండలు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో సోమవారం ఎండలు మండిపోయాయి. గరిష్టంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వాతావరణంలో తేమ తగ్గిపోవడంతో ఉక్కపోతతో ప్రజలు విలవిల్లాడారు. ఎప్పుడు రద్దీగా ఉండే ఫారెస్టు జంక్షన్ ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారింది. ఎండల నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికులు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేయాలని జిల్లా కార్మిక ఉపాధి అధికారి లోకనాథ పండా ఉత్తర్వులు జారీచేశారు.

ఓటెత్తండహో..!

- ఓటు వేసేందుకు ఆసక్తి చూపని నగరవాసులు
- అభ్యర్థులు నచ్చలేదంటూ పోలింగ్‌కు దూరం
- కనీసం 'నోటా'నైనా వినియోగించాలని కోరుతున్న అధికారులు
- చైతన్య కార్యక్రమాలకు శ్రీకారం



భువనేశ్వర్:

నగర ఓటర్లు ఓటు వేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. గత ఎన్నికల్లో భువనేశ్వర్, శివారు ప్రాంతాల్లో జరిగిన పోలింగ్ రేటు పరిశీలించగా ఇటువంటి వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. బరిలో ఉన్న అభ్యర్థుల పట్ల ఓటరు అనాసక్తితో కలవరపడుతున్నారు. అయితే అభ్యర్థులు నచ్చని పక్షంలో నోటా ద్వారా ఓటు వేసి తమ అమూల్యమైన అభిప్రాయం వ్యక్తీకరించేందుకు సౌలభ్యం ఉంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో అట్టడుగున నోటా మీట నొక్కితే ఓటరుకు బరిలోని అభ్యర్థులు నచ్చలేదని అనుబంధ వర్గాలకు స్పష్టమవుతుంది. అయినప్పటికీ నోటా వినియోగం అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ పరిస్థితి అధిగమించేందుకు భువనేశ్వర్ నగర పాలక సంస్థ(బీఎంసీ) పలు చైతన్యకార్యక్రమాలు నిర్వహించాలని యోచిస్తోంది.

అంతంతమాత్రమే..

నోటా వినియోగం అంతంత మాత్రంగానే ఉంటోంది. గత ఎన్నికల్లో 2 శాతం కంటే తక్కువగా నోటా ఓట్లు నమోదయ్యాయి. నగర ఓటర్ల మనస్తత్వం బరిలో ఉన్న నాయకుల్ని కలవర పరుస్తోంది. ఈ విషయంలో బీఎంసీ కూడా ఓటర్లను చైతన్య పరచాలని యోచిస్తోంది. నగరాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండడంతో ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీన పరిచే ప్రమాదం ఉంటుందనే, ఈ నేపథ్యంలో పోలింగు రేటు ఎలా పెరుగుతుందనే ఆలోచనలో పడ్డారు. పౌరునికి ఓటు రాజ్యాంగబద్ధమైన హక్కు. అధిక ఓటింగు పటిష్టమైన ప్రజాస్వామ్యానికి పట్టం గడుతుంది. ఈ దిశలో ఓటర్లను చైతన్యపరచి పోలింగు శాతం పుంజుకునేలా చేసేందుకు పలు సౌకర్యాలతో పోలింగ్ కేంద్రాల రూపకల్పనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి వీధిలో పౌరులకు ప్రత్యేక కరపత్రాలు పంపిణీ చేసి ఓటు హక్కు సద్వినియోగానికి పిలుపునివ్వాలని బీఎంసీ యోచిస్తోంది. సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్‌ల ద్వారా ఓటర్లను చైతన్య పరిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీక్షక ఆదరణ పొందిన బ్లాగర్ల ద్వారా ఈ అవగాహన కల్పించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ మేరకు త్వరలో తుది కార్యాచరణ ఖరారు కానుంది.

సగం మంది దూరం..

- భువనేశ్వర్, శివారు ప్రాంతాల ఓటింగ్ రేటును పరిగణనలోకి తీసుకుంటే భువనేశ్వర్ సెంట్రల్ నియోజక వర్గంలో అత్యల్ప ఓటింగు రేటు నమోదైంది. 2009లో 33.76 శాతం ఓట్లు పోలవ్వగా 2014లో జరిగిన ఎన్నికల్లో 41.33 శాతం, 2019లో 43.56 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ లెక్కన నగరం నడిబొడ్డున సగానికి పైగా ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.
- భువనేశ్వర్ ఉత్తర నియోజకవర్గంలో పరిస్థితి ఇలాగే నెలకొంది. ఇక్కడ 2009లో జరిగిన ఎన్నికల్లో 35.08 శాతం, 2014లో 41.33 శాతం, 2019లో 43.56 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రతి ఎన్నికల్లోనూ ఓటింగ్ శాతం పెరుగుతున్నా 50 శాతాన్ని తాకడం లేదు. ఏకామ్ర నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. 2009లో ఇక్కడి పోలింగు రేటు 37.19 శాతం కాగా 2014లో 45.97 శాతం, 2019లో 46.77 శాతంగా నమోదైంది. ఈ లెక్కన రాజధాని నగరంలో సమగ్రంగా పోలింగు రేటు సగం కంటే తక్కువగా కొనసాగుతుంది. నగరంలోని మొత్తం ఓటర్లలో సగం మంది ఓటు వేయడం లేదని తెలుస్తుంది.

సరిహద్దు ప్రాంతాల్లో మెరుగు..

నగరం సరిహద్దు ప్రాంతం నియోజకవర్గంలో ఓటర్ల ఆసక్తి కాస్త ప్రోత్సాహకరంగానే ఉంది. జట్నీ, జయదేవ్ నియోజకవర్గాల్లో పోలింగ్ రాజధాని నగరం కంటే మెరుగ్గా ఉంటోంది. జట్నీ శాసనసభ నియోజకవర్గంలో 2009లో జరిగిన ఎన్నికల్లో 60.5 శాతం, 2014లో 70.35 శాతం, 2019లో 67.46 శాతం పోలింగ్ నమోదైంది. జయదేవ్ నియోజకవర్గంలో 2009 ఎన్నికల్లో 65.18 శాతం, 2014లో 73.90 శాతం, 2019లో 75.55 శాతం ఓట్లు పోలయ్యాయి.

అత్యధిక పోలింగ్ అవసరం..

ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యధిక పోలింగ్ అవసరం. ఓటు హక్కు సద్వినియోగంతో ఓటరు పటిష్టమైన ప్రభుత్వం ఏర్పాటులో భాగస్వామిగా నిలుస్తారు. విచక్షణతో కూడిన స్వేచ్ఛతో అభీష్టం మేరకు ఓటు వేయడం పౌరుని కర్తవ్యం. ఆమోదయోగ్యమైన అభ్యర్థి లేకుంటే ఓటు హక్కు వేజార్చుకోకుండా నోటాకు ఓటు వేయడం పటిష్ట ప్రజాస్వామ్య వ్యవస్థని మరింత పటిష్టపరుస్తుంది.



నోటా పట్ల అనాసక్తి..

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు నిర్ణయం శాసనం. ఓటు హక్కుతో ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామిగా వెలుగొందాలి. ఈ ప్రక్రియలో స్వీయ విచక్షణతో స్వేచ్ఛగా ఓటు వేసేందుకు భారత ఎన్నికల వ్యవస్థ పలు సౌలభ్యాలు కల్పించింది. ఓటరుకు తగిన అభ్యర్థి బరిలో లేని పరిస్థితుల్లో తన అభిప్రాయం యథేచ్ఛగా వ్యక్తీకరించేందుకు భారత ఎన్నికల సంఘం నోటా ప్రవేశ పెట్టింది. ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రం ఈవీఎం అట్టడుగున నోటా మీటను ఏర్పాటు చేశారు. బరిలో ఉన్న అభ్యర్థులు నచ్చకపోతే నోటాపై ఓటు వేయాలన్న నిబంధనపై ఓటర్లు ఆసక్తి చూపడం లేదు. పోలింగ్ ప్రక్రియలో పారదర్శకత ప్రదర్శించడంలో నోటా కీలక పాత్ర పోషిస్తుంది. ఈ దిశలో కూడ రాజధాని నగర ఓటర్లు వెనుకంజ వేస్తున్నారు. తరచు నోటా ఓట్లు శాతం దిగజారుతోంది. భువనేశ్వర్ సెంట్రల్ నియోజకవర్గంలో 2014లో 1.08 శాతం నోటా ఓట్లు పోలు కాగా 2019లో 0.73 శాతానికి దిగజారింది. ఏకామ్ర నియోజకవర్గంలో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ రెండు ఎన్నికల్లో వరుసగా 1.5 శాతం, 0.77 శాతం నోటా ఓట్లు పోలయ్యాయి. భువనేశ్వర్ ఉత్తర నియోజకవర్గంలో 2014, 2019 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో వరుసగా నోటా పోలింగు శాతం సుమారు 1 శాతానికి పరిమితం అయింది. ఇక్కడ గత 2 ఎన్నికల్లో వరుసగా 1.03 శాతం, 1.13 శాతం నోటా ఓట్లు పోలయ్యాయి. రాజధాని నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జట్నీ నియోజకవర్గంలో 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 1.81 శాతం నోటాకు ఓట్లు పడగా 2019లో గణనీయంగా దిగజారి 0.8 శాతానికి పరిమితమైంది. జయదేవ్ నియోజకవర్గంలో ఈ రెండు ఎన్నికల్లో నోటాకు వరుసగా 0.93 శాతం, 0.68 శాతం ఓట్లు వచ్చాయి.

ఊరంతా ఒక్కటై..!



గ్రామస్తులు నిర్మించుకున్న కర్రవంతెన

- కర్రవంతెనను నిర్మించుకున్న కంగొసిరి గ్రామస్తులు
- పాలకుల తీరును నిరసిస్తూ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటన

రాయగడ: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా కంగొసిరి గ్రామస్తులు స్వయంగా నాగావళి నదిపై తాత్కాలిక కర్రవంతెను నిర్మించుకుని రాకపోకలకు మార్గం సుగమం చేస్తున్నారు. నదిపై వంతెన నిర్మించాలని అధికారులు, నాయకులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో ఊరంతా ఒక్కటై కర్రలతో వంతెన నిర్మించుకుని ఐక్యత చాటుకున్నారు. ఇదే క్రమంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను తామంతా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి శింగారి పంచాయతీ కంగొసిరి గ్రామంలో సుమారు 35 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా శింగారి పంచాయతీకి వెళ్లాలంటే మధ్యలో నాగావళి నదిని దాటాల్సిందే. నిత్యావసర సరుకులు, చదువులు, పెన్షన్లు తీసుకోవాలన్నా ఈ నదిని దాటక తప్పదు. వంతెన నిర్మించాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఇటీవల సమావేశమై తాత్కాలికంగా కర్రవంతెన నిర్మించుకున్నారు. బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం పరిధికి చెందిన ఈ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆదివాసీ, హరిజన, సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ఒక్కసారి కూడా అడుగు పెట్టలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఓటు అడిగేందుకు వచ్చిన నాయకులకు తగిన బుద్ధి చెబుతామని మండిపడుతున్నారు.

జాజ్‌పూర్‌లో బస్సు ప్రమాదం

- ఐదుగురు మృతి
- రూ.3లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం నవీన్

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లాలో సోమవారం రాత్రి ప్రయాణికుల బస్సు ప్రమాదానికి గురైంది. ఓవర్‌బ్రిడ్జిపై నుంచి పడిపోయిన ఘటనలో ఐదుగురు మరణించారు. దాదాపు 50 మంది ప్రయాణికులతో ఈ బస్సు పూరీ నుంచి కోల్‌కతా వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. జాజ్‌పూర్ జిల్లా బారాబటి ఛక్ సమీపంలో ఫ్లై ఓవర్‌పై నుంచి బస్సు జారిపడి ఐదుగురు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడంతో పాటు వారి బంధువులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి తగిన చికిత్స అందించడానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



ప్రమాదానికి గురైన బస్సు

ఎంత పనిచేశావు తల్లీ..!



బిడ్డ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి వగి పొడియామి

- మద్యం మత్తులో కొడుకు ప్రాణం తీసిన తల్లి
- దాచిపెట్టిన డబ్బులు ఖర్చు చేశాడనే కోపంతో దాడి
- తుంబాగూడలో విషాదం

మల్కన్‌గిరి: మద్యం మత్తులో ఆ తల్లి తనకు తెలియకుండానే సొంత కొడుకు ప్రాణం తీసింది. ఈ హృదయ విదారకర ఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి తుంబాగూఢ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంబాగూఢ గ్రామానికి చెందిన ముక్క పొడియామి, వగి పొడియామిలు భార్యాభర్తలు. కూలి పనిచేస్తూ ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. ఎప్పట్లాగే ఆదివారం పనికి బయలుదేరి వెళ్తుండగా కుమారుడు రోహిత్ (8) తల్లికి డబ్బులు అడిగాడు. తన వద్ద లేవంటూ తల్లిదండ్రులిద్దరూ పనికి వెళ్లిపోయారు. తర్వాత రోహిత్ తన తల్లి దాచిపెట్టిన సొమ్ములో కొంతమొత్తాన్ని ఖర్చుపెట్టేశాడు. సాయంత్రం పూటుగా తాగి ఇంటికి వచ్చిన తల్లికి తాను దాచిన డబ్బులు కనిపించకపోయేసరికి కుమారుడిని అడిగింది. తానే ఖర్చు పెట్టానని చెప్పడంతో కోపంతో రోహిత్ గుండెపై బలంగా కొట్టింది. ఆ దెబ్బలకు రోహిత్ మూలకుపడిపోయాడు. తాను కొట్టినందుకు అలిగి నిద్రపోతున్నాడని భావించి తల్లిదండ్రులు కూడా నిద్రపోయారు. సోమవారం ఉదయం చూసేసరికి రోహిత్ మృతిచెంది ఉండటంతో తల్లి బోరున విలపించింది. విషయం తెలుసుకున్న కలిమెల పోలీసులు, ఐఐసీ చంద్రకాంత్ తండి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఘటనకు కారణమైన వగి పొడియామి అదుపులోకి తీసుకున్నారు.

సాంస్కృతిక సంబరం



రొహన్ బిశ్వాల్ గీతాలాపన



భక్తిగీతాలను ఆలపిస్తున్న జొలీ దే



ఆర్యన్ బృందం నృత్య ప్రదర్శన



పాల్గొన్న నెక్కంటి భాస్కరరావు, అనసూయి తదితరులు



కార్యక్రమానికి హాజరైన జనసందోహం

ఒడియా ప్రజలు జరుపుకొనే కొత్త సంవత్సరం బిషువ మిలన్ రాయగడలోని తేజస్వీ గ్రౌండ్స్‌లో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. గాయకులు జొలీ దే, సౌరవ్ భరద్వాజ్‌లు ఆలపించిన భక్తి గీతాలు ప్రేక్షకులకు ఆకట్టుకున్నాయి. ఒడిశా ప్రజల ఆరాధ్యదైవం జగన్నాథునిపై ఆలపించిన గీతాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికతతో నిండిపోయింది. అనంతరం ఒడియా చలన చిత్ర నేపథ్య గాయకులు డి.రోహన్ బిశ్వాల్, సుజ్ఞాని మహాపాత్రో, అరవింద్ చక్రవర్తిల ఆధునిక, పాశ్చాత్య సంగీతాలకు అనుగుణంగా ఆలపించిన పాటలు యువతను ఉర్రూతలూగించాయి. రాత్రి 11.30 గంటల వరకు జరిగిన ఈ సంగీత విభావరి చివరలో భువనేశ్వర్‌కు చెందిన ఆర్యన్ డ్యాన్స్ గ్రూప్ కళాకారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, కొరాపుట్ లోక్‌సభ బీజేడీ అభ్యర్థి కౌసల్య హికక, రాయగడ శాసనసభ బీజేడీ అభ్యర్థి అనసూయా మాఝి తదితరులు పాల్గొన్నారు.

– రాయగడ

క్లుప్తంగా

రామయ్యకు స్వాగతం



ముగ్గులు వేస్తున్న మహిళలు

భువనేశ్వర్: శ్రీరామనవమి ఉత్సవాలలో ఆంధ్ర సంస్కృతి సమితి సభ్యులు సందడిగా ఉన్నారు. సమితి కార్యక్రమాల్లో శ్రీరామనవమి ప్రధానమైనది. ఉత్సవాల్లో ఏటా కొత్త విగ్రహాల్ని పూజించడం విశేషం. సరికొత్త శ్రీరాముడికి స్వాగతం పలికేందుకు మహిళా సభ్యులు సమితి ఆవరణని రంగవల్లులతో అలంకరించారు. శ్రీరామచంద్రమూర్తి ఆగమనం కోసం ఉత్సాహంతో నిరీక్షిస్తున్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు



అంత్యక్రియలు పూర్తి చేసిన పోలీసులు

జయపురం: జిల్లా కేంద్రాస్పత్రిలో మృతిచెందిన ఓ వృద్ధుడి మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో పోలీసులు మానవత్వంతో ముందుకొచ్చారు. సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ నెల 9న జయపురం జిల్లా కేంద్రాస్పత్రిలో ఆహార కేంద్రం సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం కనిపించింది. నీల రంగు చొక్కా, గళ్ల లుంగీ ధరించి ఉన్న ఇతడి వివరాలేవీ తెలియలేదు. కేసు నమోదు చేసిన పోలీసులు నాలుగు రోజుల పాటు మృతదేహాన్ని భద్రపరిచారు. ఎవరూ రాకపోవడంతో సోమవారం మెజిస్ట్రేట్ సమక్షంలో చంపాకులి మైదానంలో వృద్ధుడి అంత్యక్రియలు పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



లంజిపల్లి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బరంపురం: ఎన్నికలు సమీపిస్తున్నందున భారీ ఎత్తున డబ్బుల పంపకాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదివారం రాత్రి నగరం నలువైపులా నాకాబందీ చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు.

వచ్చేవి వడగాలులే!



బరంపురం: నిర్మానుష్యంగా టాటా బెంజ్ జంక్షన్


భువనేశ్వర్/బరంపురం: రాష్ట్రవ్యాప్తంగా రాబోయే ఐదు రోజులు వేడి, తేమతో కూడిన వాతావరణం, వేడిగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఈ మేరకు పసుపు హెచ్చరిక జారీ చేసింది. సోమవారం పలుచోట్ల ఎండ తీవ్రత విపరీతంగా పెరిగింది. 18 చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదయ్యాయి. బరిపదలో అత్యధికంగా 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భువనేశ్వర్, చాంద్‌బాలి, నువాపడా 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రధానంగా వాయువ్య, పశ్చిమ దిశల నుంచి పొడి గాలితో పగటిపూట ఉష్ణోగ్రత 4 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

షాపింగ్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం

సోంపేట: సోంపేట పట్టణంలోని ఎస్ఎస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. రిపేర్ కోసం ఉంచిన కట్టర్లు, ఫ్యాన్‌లు కాలిపోయినట్లు అగ్నిమాపక శాఖాధికారులు తెలిపారు. వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు, సిబ్బంది ఆర్.సింహాచలం, కె.వి రమణ, బి.బాబురావు తదితరులు మంటలు ఆర్పారు.

వేటకు విరామం

- అమల్లోకి వచ్చిన చేపల వేట నిషేధం
- సముద్రంలో మోటారు బోట్లకు అనుమతి నిరాకరణ



సముద్రంలో మత్స్యకారులు

భువనేశ్వర్:

మత్స్య సంతతి వృద్ధి చెందే కాలం కావడంతో సముద్రంలో చేపల వేట నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిషేధం రెండు నెలల పాటు నిరవధికంగా కొనసాగుతుంది. ఒడిశా మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ యాక్ట్ సెక్షన్ 4లో భాగంగా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు రాష్ట్ర తీరం వెంబడి సముద్రంలో యాంత్రిక బోట్లతో చేపల వేటకు అనుమతి ఉండదు. ఈ మేరకు మత్స్యకారులు, ట్రాల్ ఆపరేటర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఒడిశా తీరానికి 12 నాటికల్ మైళ్ల వరకు నిషేధ పరిధిగా పేర్కొన్నారు. 8.5 మీటర్ల కంటే తక్కువ పొడవైన సంప్రదాయ చిన్న పడవలకు మాత్రం వేట నిషేధం నుంచి మినహాయించారు. రాష్ట్రంలో 480 కి.మీ తీరప్రాంతంలో 60 రోజుల నిరవధిక చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. చేపల సంతానోత్పత్తి కాలంలో ట్రాలర్ల వల్ల కలిగే అవాంతరాలను నివారించేందుకు నిషేధం విధించినట్లు కుజంగ్ వద్ద మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ జగన్నాథ రావు తెలిపారు. ఈ సమయంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు. నిషేధాన్ని ఉల్లంఘిస్తే చేపలు పట్టే పడవలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చేపల వేట జీవనాధారంగా జీవిస్తున్న వర్గాల దీర్ఘకాలిక లబ్ధిని దృష్టిలో ఉంచుకుని నిషేధం అమలు చేసినట్లు వివరించారు.

మహాగౌరి స్వరూపిణిగా..



పూజలందుకుంటున్న జగులై మాత

భువనేశ్వర్: జట్నీ కుదియారి గ్రామదేవత జగులై మాత వసంత నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అష్టమి తిథి పురస్కరించుకుని సోమవారం అమ్మవారు మహాగౌరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గుప్త సేవల అనంతరం మంగళ హారతి సమర్పించి భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. ఉత్సవాల్లో భాగంగా జగులై మాత తన సోదరి గొడా బొమ్మై ఆలయాన్ని సందర్శిస్తుంది. ఈ సందర్భంగా పల్లకిలో ఊరేగింపుగా గ్రామస్తులు జగులై మాతని తరలిస్తారు. ప్రాతః, మధ్యాహ్న సేవల్ని సోదరి ప్రాంగణంలో అందుకుని విరామం తర్వాత సొంత ఆలయానికి తరలివస్తుంది. షోడశోపచారాలతో దేవీ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు పేర్కొన్నారు.

జట్నీ ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్ బహిష్కరణ



కుమారుడి ఎన్నికల ప్రచారంలో సురేష్‌కుమార్ రౌత్రాయ్(కుడి నుంచి రెండో వ్యక్తి)

భువనేశ్వర్: కాంగ్రెస్ సీనియర్ నేత సురేష్‌కుమార్ రౌత్రాయ్‌ని పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించినట్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సోమవారం ప్రకటించింది. క్రమశిక్షణా రాహిత్యం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. సురేష్ కుమార్ రౌత్రాయ్ చిన్న కుమారుడు మన్మథ్ రౌత్రాయ్ భువనేశ్వర్ లోక్‌సభ స్థానం నుంచి బిజూ జనతా దళ్ టికెట్‌పై ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తండ్రి సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ విధేయుడుగా పేరొందారు. ఈ తరుణంలో తండ్రి అభ్యర్థనను తిరస్కరించి మన్మథ్ రౌత్రాయ్ అధికార బిజూ జనతాదళ్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఈ క్రమంలో తన కుమారుడు మన్మథ్ రౌత్రాయ్ గెలుపు కోరుతూ సురేష్‌కుమార్ బహిరంగంగా ప్రచారం చేసినట్లు కాంగ్రెసు అధిష్టానం దృష్టికి పలువురు తీసుకెళ్లారు. ఈ చర్య పట్ల వివరణ కోరుతూ కాంగ్రెస్ షోకాజ్ నోటీసును జారీ చేసింది. అయితే తాను ఏ ఇతర పార్టీ తరఫున ప్రచారం చేయబోనని స్పష్టం చేస్తూ వివరణ దాఖలు చేస్తు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తుది శ్వాస వరకు కాంగ్రెసు అభ్యర్థిగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. అయితే, తండ్రీకొడుకుల బంధాన్ని ఏ పార్టీ అడ్డుకోదని ప్రకటించారు.

అగ్నిమాపక సిబ్బంది ఔదార్యం



గాయపడిన వ్యక్తిని పీహెచ్‌సీకి తరలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ అగ్నిమాపక సిబ్బంది స్ఫూర్తి కనబరిచారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని కాశీనగర్ ప్రాథమిక చికిత్సా కేంద్రంలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు. సోమవారం ఇద్దుడి గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో జగదీష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కాశీనగర్ అగ్నిమాపక సిబ్బంది వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందజేశారు. అలాగే, కాశీనగర్ సమితి కిత్తంగి గ్రామశివార్లలో జి.రవికుమార్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడగా 108 అంబులెన్సు చేరుకోవడం ఆలస్యమైంది. దీంతో అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వెళ్లి క్షతగాత్రుడిని ప్రాథమిక చికిత్సా కేంద్రంలో చేర్చారు. ఈ సందర్భంగా సిబ్బందిని స్థానికులు అభినందించారు.

విశ్రాంత హోంగార్డుకు చెక్కు అందజేత

శ్రీకాకుళం క్రైమ్: సహచర హోంగార్డులు స్వతహాగా అందజేసిన ఒక్క రోజు గౌరవ వేతనం నగదు చెక్కును విశ్రాంత హోమ్‌గార్డు ఆరిక నూకయ్యకు ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం అందజేశారు. జిల్లా హోమ్‌గార్డు యూనిట్‌లో నూకయ్య పనిచేసి గతనెలలో పదవీ విరమణ పొందారు.

ఈ మేరకు ఒక రోజు గౌరవ వేతనం రూ.4.21 లక్షల చెక్కును ఎస్పీ జిల్లా కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.నర్సింగరావు, ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ రాజు తదితరులున్నారు.

బరంపురంలో గురుశిష్యుల పోరు



రమేష్‌చంద్ర చావ్ పట్నాయక్(బీజేడీ) ప్రచారం



ప్రచారంలో కె.అనిల్‌కుమార్(బీజేపీ)

బరంపురం : సార్వత్రిక ఎన్నికల సరికొత్త రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారుతున్నాయి. గంజాం జిల్లా రాజకీయాల్లో కీలకమైన బరంపురం శాసనసభ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. అధికార బీజేడీ నుంచి మూడు సార్లు విజయం సాధించిన డాక్టర్ రమేష్ చంద్ర చావ్ పట్నాయక్ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇతని శిష్యుడు, ఇటీవల బీజేడీని వీడి బీజేపీలో చేరిన కె.అనిల్‌కుమార్ గట్టి పోటీ ఇస్తున్నారు. మరోవైపు గంజాం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత దీపక్ పట్నాయక్ సైతం గెలుపే లక్ష్యంగా పోరాడుతున్నారు. వీరు ముగ్గురు హోరాహోరీగా ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.



దీపక్ పట్నాయక్ (కాంగ్రెస్)

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా..

- మల్కన్‌గిరి జిల్లాలో డీజీ అరుణ్‌కుమార్ షోడంగి పర్యటన
- కూంబింగ్, తనిఖీలు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశం



పోలీసులు, జవాన్లతో మాట్లాడుతున్న డీజీ అరుణ్‌కుమార్

మల్కన్‌గిరి : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరగడమే లక్ష్యంగా మల్కన్‌గిరి జిల్లాలో సోమవారం డీజీ అరుణ్‌కుమార్ షోడంగి సుడిగాలి పర్యటన చేశారు. మల్కన్‌గిరితో పాటు చిత్రకొండ సమితి స్వభిమాన్ ఏరియా గురసేత్, జోడాంబ్, పేప్పరమెట్ల పంచాయతీల్లో పర్యటించి బీఎస్ఎఫ్, ఎస్ఓజీ జవాన్లతో చర్చించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా దిశా నిర్దేశం చేశారు. కూంబింగ్, వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలని ఆదేశించారు.



హెలికాప్టర్ వద్ద డీజీ, అధికారులు

సరిహద్దుల్లో అప్రమత్తత..

అనంతరం మల్కన్‌గిరి జిల్లా ఎస్పీ కార్యాలయంలో డీజీ విలేకరులతో మాట్లాడారు. మల్కన్‌గిరి జిల్లాకు ఆనుకుని నాలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లు ఉన్నందున సరిహద్దుల్లో కూంబింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈసారి తొలిసారిగా చిత్రకొండ స్వాభిమాన్ ఏరియాలో పోలింగ్ స్టేషన్లుఏర్పాటు చేసి పూర్తి శాంతిభద్రతల మధ్య ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సోమేంద్ర ప్రియదర్శి, ఏడీజీ, శాంతిభద్రత రాష్ట్ర పోలీసు నోడల్ అధికారి సంజయ్‌కుమార్, ఏడీజీ ఓపీఎస్ దేవ్‌దత్త్ సింగ్, మల్కన్‌గిరి ఎస్పీ నితీష్ వాద్వానీ, కొరాపుట్ ఎస్పీ అభినయ్ సోంకర్, రాయగడ ఎస్పీ హరీష్ బి.సి, నవరంగపూర్ ఎస్పీ రోహిత్ వర్మ, బీఎస్ఎఫ్ డీఐజీ శైలేశ్‌కుమార్, బెటాలియాన్ అధికారులు వరుణేంద్ర సింగ్, ధనంజేయ్ సింగ్, నీరజ్‌కుమార్, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా విజయం సాధిద్దాం



మాట్లాడుతున్న అనసూయా మాఝి. పక్కనే నెక్కంటి తదితరులు

రాయగడ: అందరూ మనస్పర్థలు వీడి తన విజయానికి సహకరించాలని రాయగడ శాసనసభ బీజేడీ అభ్యర్థి అనసూయా మాఝి కోరారు. తన వల్ల తప్పుజరిగి కార్యకర్తలను విస్మరించినట్లయితే పెద్ద మనసుతో క్షమించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు స్వగృహంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్‌డీసీ చైర్మన్‌గా విధులు నిర్వహించే సమయంలో జిల్లాలోని ఆదివాసీ, హరిజనుల సంక్షేమానికి అనేక సేవలు అందించానని గుర్తు చేశారు. ప్రప్రథమంగా రాయగడ శాసనసభ నుంచి ఒక మహిళకు పోటీ చేసే అవకాశం లభించడం గర్వకారణమన్నారు. కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామన్నారు. నెక్కంటి సారథ్యంలో విజయదుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. అనంతరం నెక్కంటి మాట్లాడుతూ జిల్లాలోని రాయగడ, బిసంకటక్, గుణుపూర్ నియోజకవర్గాల్లో బీజేడీ విజయానికి సమష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో కాసీపూర్, రాయగడ, కెరడ, జేకేపూర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



కుంద్రాలో వారోత్సవాలు జరుపుకొంటున్న సిబ్బంది



బొరిగుమ్మలో అగ్నిమాపక వారోత్సవాల్లో సిబ్బంది

జయపురం: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మలో అగ్నిమాపక అధికారి ఉమేష్ చంద్ర బాగ్ మాట్లాడుతూ 1944లో ముంబై డాక్ యార్డులో జరిగిన అగ్ని ప్రమాదంలో 66 మంది సిబ్బంది దుర్మరణం చెందారని, వారి సేవలకు గుర్తుగా ఏటా సహిద్ దినం, జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది దేవాసిస్ స్పైి, రంజన్ మల్లిక్, రూసేబ్ పటేల్, ఆశిష్ పండా, ఢిల్లేశ్వర సెఠియ, హేమంత గొరడ పాల్గొన్నారు. కుంద్రాలోనూ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. అగ్నిమాపక అధికారి సరోజ్ కుమార్ ఖడియా, పీతాంబర్ బైరాగి, గురుదేవ్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేడీలో పెద్దకింగ గ్రామస్తుల చేరిక



పార్టీలో చేరిన వారితో బీజేడీ అభ్యర్థి రూపేష్

పర్లాకిమిడి: ఇతర పార్టీల కంటే బీజేడీలోకి కాంగ్రెస్, బీజేపీల నుంచి వలసలు పెరిగాయని ఆ పార్టీ పర్లాకిమిడి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి అన్నారు. గుమ్మా బ్లాక్ పెద్దకింగ గ్రామంలో సోమవారం యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీని వీడి బీజేడీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు, భరత్ భూషన్ మహంతి, రూపేష్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

జెమ్స్‌లో అరుదైన ఆపరేషన్ విజయవంతం



థైరాయిడ్‌తో ఉన్న మహిళ తొలగించిన కణితి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో సోమవారం అరుదైన ఆపరేషన్‌ను జెమ్స్ వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఒడిశా రాష్ట్రం, రాయగఢ, గువగణ ప్రాంతానికి చెందిన తడింగి అన్న అనే మహిళా కొన్నేళ్లుగా థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నారు. తెలిసిన వారి ద్వారా ఆమె జెమ్స్‌కు వచ్చారు. సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సందీప్, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఈమెకు పరీక్షలు నిర్వహించి శరీరంలో ఉండాల్సిన 25 గ్రాములు థైరాయిడ్ 750 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈమెకు నాలుగు గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి కణితిని తొలగించారు. ఈ ఆపరేషన్ అంతా బీఎస్‌కెవై పథకం ద్వారా ఉచితంగా చేసినట్లు జెమ్స్ ఆర్ఎంఓలు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, బాలమురళీలు తెలిపారు.

21 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని గుడారిలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. గుడారిలోని గజ్జిగాం వద్ద చేపట్టిన తనిఖీల్లో వీరు పట్టుబడ్డారు. నిందితులను సోమవారం కోర్టుకు తరలించారు.

గడ్డి కుప్పలు దగ్ధం




అగ్ని ప్రమాదానికి గురైన గడ్డి కుప్పలు

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం మర్రిపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన రాంపాత్రుని అగస్తినాయుడు, ఎన్.లక్ష్మీనారాయణ, ఎన్.రాజారావు అనే రైతులు తమ పశువుల మేత కోసం ఉంచిన నాలుగు గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమీపంలో విద్యుత్ తీగలు ఉండటం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు.

పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు వెల్లడి

ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు సోమవారం ఎగ్జామినేషన్స్ డీన్ ఉదయ్ భాస్కర్ విడుదల చేశారు. 18 కోర్సులకు సంబంధించి 446 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 374 మంది ఉత్తీర్ణత సాధించారు.

● శాంతి సందేశం



ప్రపంచ కళా దినం పురస్కరించుకుని అంతర్జాతీయ సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ శాంతి నినాదమిచ్చారు. పూరీ సాగర తీరంలో ఆకర్షణీయంగా సైకత కళాఖండం తీర్చిదిద్దారు. – భువనేశ్వర్

క్లుప్తంగా

యువకునిపై కత్తితో దాడి

పొందూరు: మండలంలోని రాపాక కూడలి సమీపంలో గల మద్యం దుకాణం వద్ద ఓ యువకుడిని ఆదివారం కత్తితో పొడిచారు. ఈ సంఘటనపై ఎస్ఐ వై.రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. పొందూరు పంచాయతీ పరిధిలోని ఎరుకుల కాలనీకి చెందిన జి.రాము అనే యువకుడిని పొందూరు పట్టణానికి చెందిన ఎస్.ఈశ్వరరావు, వాసు, చక్రి అనే యువకులు కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచారు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో రమణ అనే వ్యక్తి మద్యం దుకాణం సమీపంలో రహదారి పక్కన గల కల్వర్టుపై కూర్చొన్నాడు. అక్కడికి మద్యం మత్తులో ద్విచక్రవాహనంపై యువకులు ఈశ్వరరావు, వాసు, చక్రిలు వచ్చి రమణను డబ్బులు అడిగారు. అతడు లేవని చెప్పడంతో ఒక్కసారిగా దాడి చేశారు. అతడి జేబులో ఉన్న డబ్బులను, సెల్‌ఫోన్‌ను లాగేసుకున్నారు. దీంతో రమణ అరవడంతో సమీపంలో ఉన్న ఆయన తమ్ముడు జి.రాము, కుటుంబ సభ్యులు పరిగెత్తుకుని వచ్చి అడ్డుకోబోయారు. దాంతో ఈశ్వరరావు తన వద్ద గల కత్తితో రామును పొత్తి కడుపులోను, ఎడమవైపు పక్కటెముకులలో బలంగా పొడిచారు. దీంతో తీవ్రగా గాయపడిన రామును శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గాయపడిన రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

గల్ఫ్ వెళ్లేందుకు బయల్దేరి..



నీలాపు గణేశ్ (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: గల్ఫ్ వెళ్లి వస్తానంటూ స్నేహితులు, కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువకుడు విగతజీవిగా మారాడు. మండలంలోని కేదారిపురం గ్రామానికి చెందిన నీలాపు కామరాజు, తరిణమ్మల రెండో కుమారుడు నీలాపు గణేశ్(23) ముంబైలో అనుమానస్పదరీతిలో మృతి చెందాడు. గణేశ్ తండ్రి కామరాజు ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి, అన్నయ్య దుర్యోధన, చెల్లెలు లావణ్యతో కలసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. వెల్డర్‌గా శిక్షణ పొందిన గణేష్ దుబాయ్ వెళ్తానంటూ గత నెల 16న ముంబై వెళ్లాడు. వీసా రావడం ఆలస్యం కావడంతో ముంబైకి సమీపంలోని ఎగత్‌పూర్‌లో ఉంటున్నాడు. అక్కడ ఏమైందో ఏమో గానీ గణేష్ శనివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఫోన్, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్న ఎగత్‌పూర్ జీఆర్పీ పోలీసులు ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అందరితో కలివిడిగా ఉన్న వ్యక్తి విగతజీవిగా మారడంపై గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బంగారు శతమానం బహూకరణ

విజయనగరం: పట్టణంలోని చిక్కాలవీధిలో ఉన్న సీతారామచంద్ర ఆలయంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సతీమణి కోలగట్ల వెంకటరమణి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం దగ్గరుండి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్ర స్వామివారికి బంగారు శతమానం, పుష్పఫలాదులను ఆమె సమర్పించారు. శ్రీరాముని ఆశీస్సులు ప్రతీ ఒక్కరిపైనా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.

కామాక్షినగర్‌లో చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక కామాక్షినగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలు పట్టుకుపోయారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామాక్షినగర్‌లో నివాసం ఉంటున్న పతివాడ వెంకటరమణ తల్లి గజపతినగరంలో ఇటీవల మరణించడంతో చేపట్టాల్సిన కార్యక్రమాల నిమిత్తం ఈ నెల 13న ఆయన కుటుంబంతో కలిసి వెళ్లాడు. అయితే సోమవారం ఉదయం కామాక్షినగర్‌లోని ఆయన పక్కింటి వారు ఫోన్‌చేసి, ఇంటి తాళాలు, తలుపులు పగులగొట్టి ఉన్నట్లు చెప్పగా హుటాహుటిన వచ్చి ఇంట్లో పరిశీలించి బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలు దొంగలు పట్టుకుపోయినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటనాస్థలానికి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించింది. ఎస్సై తారకేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాముని కల్యాణానికి ముహూర్తపురాట

మక్కువ: శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని, సీతారాముని కల్యాణానికి స్థానిక సాయిరామలింగేశ్వరాలయంలో సోమవారం ముహూర్తపురాట వేశారు. ఈ పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఆయన సతీమణి రామలక్ష్మి పాల్గొని సీతారామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు ఆలయానికి చేరుకుని ముహూర్తపురాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల17వతేదీన సాయి రామలింగేశ్వరాలయంలో శ్రీరామనవమి వేడుకలతో పాటు, సీతారాముని కల్యాణం, అన్నసమారాధన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు చర్యలు చేపడుతున్నారు.

ఆకట్టుకోని పురాణం
అతకని అబద్ధం

- ఇదీ చీపురుపల్లి కూటమి అభ్యర్థి కళా వెంకటరావు ప్రచార తీరు
- నవ్వుకుంటున్న సొంత పార్టీ కేడర్, ద్వితీయ శ్రేణి నాయకులు



చీపురుపల్లి: అబద్ధం ఆడితే అతికినట్లు..పురాణం చెప్తే ఆకట్టుకునేలా ఉండాలంటారు. ఇదే తరహాలో ఎన్నికల ప్రచారంలో శతవిధాలా ప్రయత్నిస్తున్న చీపురుపల్లి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి టీడీపీకి చెందిన కళా వెంకటరావు తీరును చూస్తూ ఆయన చెబుతున్న అబద్ధాలు వింటూ సొంత పార్టీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నవ్వుకుంటున్నారు.

నోటికొచ్చిన అబద్ధం చెప్పడం ప్రజలను మోసం చేసి మభ్యపెట్టడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య అనుకుంటారు అంతా. ఎందుకంటే సాక్షాత్తు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడే పూటకో అబద్ధం, రోజుకో మోసం అనే చందాన తొలి నుంచి రాజకీయాలు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఆయన్నే ఆదర్శంగా తీసుకుంటున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఉన్న ఆ పార్టీ నేతలు మన బాస్ ఇష్టారాజ్యం అబద్ధాలు చెబుతున్నప్పుడు మనం చెప్తే ఏముందిలే అనుకుంటున్నారేమో గాని చంద్రబాబునే డిటోగా ఫాలో అయిపోతున్నారు. అందులో భాగంగానే చీపురుపల్లి కూటమి అభ్యర్థిగా కొత్తగా నియోజకవర్గానికి వచ్చిన కిమిడి కళా వెంకటరావు కూడా మద్యపాన నిషేధం, డ్వాక్రా రుణమాఫీ, తోటపల్లి సాగునీటి కాలువ కోసం అబద్ధాలే ప్రచార అస్త్రాలుగా ప్రతి రోజూ ప్రజలను మభ్యపెట్టే ప్రక్రియ ప్రారంభించారని స్థానికంగా చర్చ జరుగుతోంది. అసలు ఇక్కడి ప్రజలకు ఏమీ తెలియదన్నట్లు, రెండు దశాబ్దాల క్రితంలో మాదిరిగా ఏం చెప్పినా పర్లేదనుకుంటున్నారేమో గానీ మరీ అబద్ధాలు చెప్పేస్తున్నారని సొంత పార్టీ కార్యకర్తలే చెవులు కొరుక్కుంటున్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా ఎంతో విజ్ఞత కలిగిన ఓటర్లు ఉన్న చీపురుపల్లిలో ఇలాంటి పుక్కిటి పురాణాలు ఎవరూ నమ్మరని టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నట్లు సమాచారం.

మద్యపాన నిషేధం ఎత్తేసి, మంచి లిక్కర్ ఇస్తామంటూ..

పేదలకు మద్యం దూరం చేయాలన్న లక్ష్యంతో టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావు మద్యపాన నిషేధం విధించారు. ఆ తరువాత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కుని ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసిన సంగతి అందరికీ గుర్తుంది. మూడు శాబ్దాల క్రితం నుంచి మద్యం తాగించి పేదల ప్రాణాలు తోడేస్తున్నది చంద్రబాబేనని మద్యపాన నిషేధం కోసం మాట్లాడే అర్హత బాబుకు ఎక్కడుందంటూ చర్చ జరుగుతోంది. అంతేకాకుండా మరొకడుగు ముందుకేసి గత కొంతకాలంగా నాణ్యమైన లిక్కర్ ఇస్తానని చంద్రబాబు బహిరంగ సభల్లో ప్రకటిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. మద్యంలో కూడా మంచి, చెడు రకాలు ఉన్నాయా అంటూ కొత్త అర్థాన్ని తీసుకొచ్చిన చంద్రబాబు మరోవైపు మద్యపాన నిషేధం కోసం మాట్లాడుతుండడం, ఆ విషయాన్ని ఇక్కడ కళా వెంకటరావు ప్రజలపై రుద్దేందుకు చేస్తున్న కృషి చూస్తుంటే విడ్డూరంగా ఉందని అంతా అనుకుంటున్నారు.

వైఎస్సార్ హయాంలోనే తోటపల్లి సాకారం..

తోటపల్లి కోసం టీడీపీ నేతలు చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే హాస్యాస్పదంగా ఉన్నాయనే చర్చ జరుగుతోంది. తోటపల్లి ప్రాజెక్టు కోసం కేటాయించిన నిధులను చంద్రబాబు పక్కదోవ పట్టించి ప్రాజెక్టు పనులు నిలిపివేశారు. అదే 2004లో అధికారంలోకి వచ్చిన దివంగత మహానేత వైఎస్సార్ రూ.400 కోట్లు నిధులు కేటాయించి పనులు ప్రారంభించిన విషయాన్ని టీడీపీ నేతలు గుర్తు చేసుకోవాలని రైతులు అంటున్నారు. 2009లో మహానేత మరణ సమయానికి 90 శాతం పనులు కూడా పూర్తయిన సంగతి అందరికీ తెలిసిందే.

మహిళలను మోసం చేసింది చంద్రబాబు..

మహిళలను జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశాడని టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న నేపథ్యంలో మహిళలను మోసం చేసింది చంద్రబాబు కదా అంటూ నవ్వుకుంటున్నారు. 2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, అప్పులు తీర్చొద్దని మహిళలకు మాట ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక రుణమాఫీ ఊసెత్తని చంద్రబాబు మహిళలను మోసం చేశాడు. అదే 2019 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు విడతల్లో మహిళల రుణాలను పూర్తిస్థాయిలో వారి ఖాతాల్లోనే జమ చేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

సొసైటీ భూముల పేరిట రాజకీయం సిగ్గుచేటు

- కాళ్ల గౌరీశంకర్ ఆరోపణలు అర్థరహితం
- ఆ భూములతో ఎమ్మెల్యేకు సంబంధం లేదు
- సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు

విజయనగరం: నగరంలోని డబుల్‌కాలనీని ఆనుకుని ఉన్న 18 ఎకరాల భూమి సొసైటీ సభ్యులదేనని, ఈ విషయంలో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ తన రాజకీయ ఉనికిని చాటుకునేందుకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిపై చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆ స్థలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రతినిధులు గ్రంధి రాజశేఖర్, గంధ్రేటి సన్యాసిరావు మాట్లాడారు. సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌గా ఏర్పాటై 18 ఎకరాల స్థలాన్ని తామంతా కలిగి ఉన్నామన్నారు. సర్వే నంబర్ 209లోని 1ఎ/2 పరిధిలో గల 18 ఎకరాల భూమిపై సంపూర్ణ హక్కులు తమ సొసైటీకి సంబంధించిన అంశాలేనని చెప్పారు. అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై ఇటీవల కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరీ శంకర్ మీడియా సమావేశాలు పెట్టి స్థానిక శాసనసభ్యుడు ఆక్రమించుకున్నారంటూ ఆపాదించే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సదరు సొసైటీలో ఇబ్బందులను తెలియపరచడానికి స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి వద్దకు పలు మార్లు సొసైటీ సభ్యులంతా వెళ్లి కలిశామని చెప్పారు. ఈ విషయాన్ని వక్రీకరిస్తూ సదరు భూమి విషయమై ఎమ్మెల్యే కోలగట్లకు ఆపాదిస్తూ లేనిపోని ఆరోపణలు గౌరీశంకర్ చేస్తున్నారన్నారు.

అనవసర ఆరోపణలపై కోర్టుకు వెళ్తాం

ఈ భూమి విషయమై ఎటువంటి ప్రస్తావనైనా తమతో మాత్రమే చేయాలని, స్థలంతో సంబంధం లేని ఎమ్మెల్యే లాంటి వ్యక్తులను ఎన్నికల సమయంలో ప్రస్తావించడం గౌరీశంకర్‌కు సరికాదని హితవు పలికారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న గౌరీశంకర్ లాంటి వ్యక్తులను కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ప్రోత్సహించవద్దని కోరుతున్నామన్నారు. గౌరీశంకర్ చేస్తున్న ఆరోపణలను తాము ఖండిస్తున్నామని ఇటువంటి ప్రస్తావనలు కొనసాగిస్తే న్యాయపరంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ రెడ్డి, కె.హరి ప్రసాద్ రావు, సభ్యులు జి.గోవిందరావు ఆర్.కె.బాషా, కె.సుధాకర్ రావు, కుమార్, ఆర్. శ్రీనివాసరావు, ఎ.సరోజ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాలు



జోగింపేట విద్యాలయంలో మాట్లాడుతున్న సమన్వయకర్త టి.పద్మజ

సీతానగరం: ఉమ్మడి విజయనగరం జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5 వ తరగతిలో ప్రవేశాలకు ఎంపిక చేసిన మొదటి లిస్ట్‌లో సీట్లు దక్కనివారికి, ఇంకా మిగిలి ఉన్న సీట్ల భర్తీకి బాలురకు గురువారం కొప్పెర్ల గురుకుల పాఠశాలలో, బాలికలకు శుక్రవారం చీపురుపల్లిలో ఎంపిక జరుగుతుందని జిల్లా సమన్వయకర్త టి.పద్మజ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఎంపిక ప్రక్రియ ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందని ఆమె తెలియజేశారు. మెరిట్ లిస్ట్ జాబితాలో ఉన్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, మొబైల్ ఫోన్ నంబర్లకు ఫోన్ చేసిలేదా మెసేజ్ రూపంలో సమాచారం ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకే ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం బాలికలు ఫోన్ 83330–33434నంబర్‌కు, బాలురు ఫోన్ 63038–38657 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో జోగింపేట సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కూచిపూడి కళాకారులకు సత్కారం



బొబ్బిలి వీణలతో కళాకారులు

విజయనగరం అర్బన్: భగవతి నృత్య కళామందిర్ ఆధ్వర్యంలో ఈ నెల 23న 12 గంటల పాటు నిర్విరామంగా కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించనున్న కళాకారులకు స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా కళాకారులకు బొబ్బిలి వీణలు బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్‌నాయుడు, చెలపాక వెంకటలక్ష్మి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా సర్వే నిర్వహించాలి

- డీఈఓ పగడాలమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే -2024ను సమర్థవంతంగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం బాలికల పాఠశాలలో జరుగుతున్న ఫీల్డ్ ఇన్విజిలేటర్ల శిక్షణ (ఎస్ఎల్ఏఎస్)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మంగళవారం స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 128 పాఠశాలల్లో 13,646 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ సర్వే ఉదయం 9గంటల నుంచి 10.30 గంటల వరకు, 10.45 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ సర్వేకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డీఈఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

18 ఏళ్ల లోపు బాలలను రాజకీయ పనులకు వినియోగించరాదు



కార్మికశాఖ సహాయ కమిషనర్ కె.రామకృష్ణారావు

పార్వతీపురం టౌన్: రాజకీయ పార్టీల వారు సార్వత్రిక ఎన్నికల కార్యక్రమాల్లో గానీ, ప్రచార పనులకు గానీ 18 ఏళ్ల లోపు బాలలను వినియోగించరాదని కార్మిక శాఖ సహాయ కమిషనర్ కె.రామకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాలలను రాజకీయ కార్యకలాపాలకు వినియోగించుకున్నట్లయితే బాలకార్మిక నిషేధ చట్టం ప్రకారం 6 నెలల జైలు శిక్ష, రూ.50 వేల వరకు జరిమానాకు బాధ్యులవుతారని హెచ్చరించారు. కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం ఇంటర్ స్టేట్ మైగ్రేన్ట్స్ లేబర్ (ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు) ను ముఖ్యంగా ఇటుక బట్టీల్లో పనిచేసే అంతర్‌రాష్ట్ర వలస కార్మికులను వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వారి సొంత రాష్ట్రంలోని స్వగ్రామాలకు తప్పనిసరిగా పంపించాలని స్పష్టం చేశారు. అలా పంపించని యజమానులపై చట్టరీత్యాచర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

ఈవీఎంల తరలింపు పరిశీలించిన కలెక్టర్



ఈవీఎంలు రవాణా చేస్తున్న వాహనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల తరలింపును కలెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన గొడౌన్ నుంచి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాహనంలో ఈవీఎంలను తరలించారు. ఇప్పటికే తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గం ఈవీఎం, వీవీప్యాట్‌లపై నియోజకవర్గంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అందరూ సహకారం అందించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి. కేశవనాయుడు, తహసీల్దార్ కె.ఆనందరావు, ఆర్ఐ రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సేవల ఉద్యోగులకు పోస్టల్ బాలెట్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: అత్యవసర సేవలందిస్తున్న శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొంటూ పాస్‌లు పొందిన మీడియా వారికి ఓటింగ్ కోసం పోస్టల్ బ్యాలెట్‌ను అందించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అత్యవసర సేవలను అందించే అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ 33 శాఖలను అత్యవసర శాఖలుగా గుర్తించి వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని నోటిఫై చేసినట్లు తెలిపారు. వారంతా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12 డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, ఎలక్ట్రిసిటీ, హెల్త్ అండ్ ఫామిలీ వెల్ఫేర్, స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, ఫుడ్ అండ్ సివిల్ సప్లెస్, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజున ప్రెస్ కవరేజ్ చేయడానికి ఎన్నికల కమిషన్ జారీ చేసిన అథారిటీ లెటర్స్ కలిగి ఉన్న పాత్రికేయులు, ఫైర్ సేవలు అందిస్తున్న వారికీ పోస్టల్ బ్యాలెట్ వర్తిస్తుందన్నారు. ఆయా శాఖల అధికారులు పోస్టల్ బ్యాలెట్ కోసం సిబ్బంది వివరాలను మంగళవారం లోగా అందజేయాలని, వారందరికీ ఫారం 12 డి అందజేస్తామని తెలిపారు. ఈ ఫారాలను సమర్పించడానికి ఈ నెల 22 ఆఖరు తేదీగా తెలియజేశారు. ఫారం డి నింపిన తర్వాత ఆయా శాఖల అధికారులు సర్టిఫై చేసి అందజేస్తే మే 8, 9, 10లో ఓటు చేయవలసి ఉంటుందని తెలిపారు. ఒకసారి ఫారం డి తీసుకున్న వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తప్పిస్తే పోలింగ్‌స్టేషన్‌లో ఓటు వేసే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత, అత్యవసర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా



కూనేరు చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

కొమరాడ: ఎన్నికలు నేపథ్యంలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని కూనేరు చెక్ పోస్టును ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద కేసుల నమోదు, వాహనాల సీజ్ తదితర వివరాలను ఎస్ఐ కె.నీలకంఠంను అడిగి తెలుసుకున్నారు. అక్రమంగా మద్యం తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టంచేశారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళిని అతిక్రమించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఆర్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

శృంగవరపుకోట: మండలంలోని ముషిడిపల్లి గ్రామం వద్ద తాటిచెట్టుపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలం కుమిలి పంచాయతీ శివారు రెల్లివలస గ్రామానికి చెందిన కిలాన రాజారావు(38) ఎస్.కోట మండలంలో ఉన్న స్వప్నలోక్ లేఔట్‌లో మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తాటికాయల కోసం చెట్టెక్కి కళ్లు తిరిగి కిందపడిపోయాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. స్థానికులు హుటాహుటిన రాజారావును ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

కురుపాం: మండలంలోని పెళ్లివలస గ్రామ సమీపంలో సోమవారం బైక్ అదుపుతప్పడంతో జరిగిన ప్రమాదలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలంలోని పీటీ మండ గ్రామానికి చెందిన గుంపస్వామి, దిలీప్, వేణులు బైక్‌పై కురుపాం మండలంలోని పెళ్లివలస గ్రామంలో ఓ శుభకార్యానికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కింద పడిపోయి తీవ్రగాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వారిని తరలించగా ప్రథమ చికిత్స అందించిన వైద్యసిబ్బంది మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలిచారు. ఈ మేరకు కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుభద్రమ్మవలసలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని సుభద్రమ్మవలస పరిసరాల్లో ఏనుగులు సోమవారం సంచరించాయి. ఉదయమంతా వరి, అరటి, పామా యిల్, జొన్న పంటలో సంచరించిన ఏనుగులు మధ్యాహ్న సమయానికి చెరువులోకి చేరుకుని సేదతీరాయి. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

రామతీర్థానికి కోటి తలంబ్రాలు



ఈఓ శ్రీనివాసరావుకు పవిత్ర తలంబ్రాలను అందజేస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి గోటితో సిద్ధం చేసిన కోటి తలంబ్రాలు సోమవారం చేరుకున్నాయి. ఈ నెల 17న శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన రామభక్తులు గడిచిన నెలరోజుల నుంచి ప్రత్యేకంగా సేద్యం చేసిన ధాన్యాన్ని గోటితో ఒలిచి తలంబ్రాలుగా సిద్ధం చేశారు. సిద్ధమైన కోటి తలంబ్రాలను కళశాలలో వేసి రామతీర్థం దేవస్థానానికి తీసుకువచ్చారు. భక్తులు శ్రీరామ నామాన్ని స్మరిస్తూ రామతీర్థం తిరువీధుల్లో పవిత్ర తలంబ్రాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. రామ దేవస్థానానికి చేరుకున్న భక్తులకు ఈఓ శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి ధృవమూర్తుల వద్ద తలంబ్రాలను ఉంచి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు భద్రపరిచారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు రేగాన గోవిందరావు, సుదర్శన విజయ్‌కుమార్, ఆల్తి శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.